లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

● ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ పథకాలకు సంబంధించి లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. మాగుంట మాట్లాడుతూ బ్యాంకు శాఖ కొత్తగా ప్రారంభిస్తే ఆ విషయం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ ఏడాది జూన్ మొదటి త్రైమాసికానికి వ్యవసాయ రుణాలు రూ.4,351 కోట్లు, పారిశ్రామిక రంగానికి రూ.1,241 కోట్లు, విద్యా రంగానికి రూ.67 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌బీఐ ప్రతినిధి ఏ నాగప్రవీణ్, కెనరా బ్యాంకు ఆర్‌ఏ శశిధర్, ఏపీజీబీ ఆర్‌ఎం హేమలత, పీడీసీసీబీ సీఈఓ ప్రకాష్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీఐసీ జీఎం శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ జేడీ బేబిరాణి, ఫిషరీస్ జేడీ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డికి సత్కారం


ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

కొత్తపట్నం: ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన రెండేళ్లలో రూ.10 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి ట్యాప్‌లు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవనాలు పూర్తి చేశామన్నారు. కాంట్రాక్టర్లు నష్టం వచ్చిందంటే ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో రూ.83 లక్షల జెడ్పీ నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో 1,452 ఎకరాల చుక్కల భూముల సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. 50 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దేవరంపాడు, మోటుమాల భూములకు అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి 400 ఎకరాలను 300 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. గుండమాల మత్స్యకారులు 80 మందికి 300 ఎకరాలను అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలిచ్చామన్నారు. కె.పల్లెపాలెం నుంచి గుండమాల వరకు 7 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు వేసేందుకు జెడ్పీ నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేయించామన్నారు. ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, నరేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీపీ సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేయించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రత్నజ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌పై చర్యలు తీసుకోండి

● జేసీ శ్రీనివాసులు


రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రోడ్లపై ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రానైట్ ఓవర్ లోడ్ వేయకుండా క్వారీల వద్ద కట్టడి చేయాలన్నారు. కాంట్రాక్టు క్యారేజీ బస్సులకు అద్దంకి బస్టాండ్ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించాలన్నారు. నగరంలో రోడ్లపై తిరుగుతున్న పశువులు, ఆవులను వారంలోపు స్థలం గుర్తించి తరలించాలన్నారు. కార్యక్రమంలో ఉపరవాణా కమిషనర్ సుశీల, ట్రాఫిక్ డీఎస్పీ, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్, వైద్యారోగ్యశాఖ, ఆర్టీసీ, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు నవోదయ విద్యార్థుల కృతజ్ఞతలు


ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నవోదయ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని స్థానిక జవహర్ నవోదయ విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. దశాబ్దాలుగా నీటికొరతతో విలవిల్లాడుతున్న తమ విద్యా సంస్థలో శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయించడంతో ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జవహర్ నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం


అంగన్‌వాడీ టీచర్లు వేసిన ఆర్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సీడీపీఓ రాజమణి

ఒంగోలు సబర్బన్: పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఒంగోలు అర్బన్ సీడీపీఓ పరిధిలో శుక్రవారం స్థానిక కొప్పోలులో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొప్పోలు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ పౌష్టికాహార మాసోత్సవాల్లో అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన పౌష్టికాహారాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు రోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం అందరికీ తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. 6 నెలల నుంచి 24 నెలల వరకు ఉన్న చిన్నారులకు తరచూ పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చన్నారు. ద్రవాలను అధికంగా ఇవ్వడం, తరచూ తక్కువ మోతాదుల్లో ఆహారం ఇవ్వటం మంచి పరిణామమని పేర్కొన్నారు. మహిళలు గర్భంతో ఉన్నప్పుడు వారికి అధికంగా పోషకాహారం అవసరమవుతుందని వివరించారు. పుట్టబోయే పిల్లలకు విటమిన్ల లోపాలు లేకుండా గర్భిణులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ సీడీపీఓ కేవీపీ రాజకుమారి, 10వ డివిజన్ కార్పొరేటర్ బెంగళూరు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్, జేసీ, మేయర్, డీఎంఅండ్‌హెచ్‌వో

● కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి నిర్వహించాల్సిన ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశాల ప్రకారం వైద్య శిబిరాలను పక్కాగా నిర్వహించి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో విధులు నిర్వహించే అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ వేణుగోపాల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, డీఐఓ పద్మజ, క్షయ నివారణ అధికారి సురేష్, ఐసీడీఎస్ పీడీ మాధురి, అధికారులు పాల్గొన్నారు.

10 గ్రాముల బంగారం చోరీ

కొత్తపట్నం: పది గ్రాముల బంగారం చోరీ కావడంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సంతనూతలపాడు మండలం గుమ్మళ్లపాడు గ్రామానికి చెందిన సంకే రామయ్య ఈ నెల 25వ తేదీ ఒంగోలు జీజీహెచ్ నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు ఆటో ఎక్కాడు. కొత్తపట్నంలో బంధువుల ఇళ్లకు వెళ్లాలని కొత్తపట్నం బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కగా, తాను కూడా కొత్తపట్నం వెళ్తున్నానని డ్రైవర్ నమ్మపలికాడు. అదే ఆటోలో కొత్తపట్నం బయలుదేరగా బకింగ్‌హాం బ్రిడ్జి వద్ద ఆటో ఆపి రామయ్య చేతికి ఉన్న రెండు ఉంగరాలు కలిపి సుమారు 10 గ్రాముల బంగారాన్ని ఆటోడ్రైవర్ లాక్కుని వెళ్లిపోయాడు. రామయ్య ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేశారు.

మైనర్ నిందితులకు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

ఒంగోలు టౌన్: ఒక హత్య కేసులో నిందితులకు సహకరించిన ఇద్దరు మైనర్లకు ఏడాది పాటు ఏదైనా ప్రభుత్వ వైద్యశాలలో సేవలు అందించాలని జువైనల్ జస్టిస్ బోర్డు శుక్రవారం తీర్పు చెప్పింది. కొమరోలు మండలానికి చెందిన లింగయ్య గ్రామంలో పెత్తనం చెలాయించేవాడు. అదే గ్రామానికి చెందిన శివ అతడి పెత్తనాన్ని ప్రశ్నించడం సహించలేని లింగయ్య అతడిని మట్టుబెట్టేందుకు కుట్ర పన్నాడు. 2015 మే 27వ తేదీ సాయంత్రం శివ ఇంటి వద్ద ఉన్నాడు. అక్కడికి చేరుకున్న లింగయ్య బంధువులు, ముద్దాయిలు అతడితో ఘర్షణకు దిగారు. ఈలోపు ఒకరు శివను కత్తితో పొడిచారు. అందుకు ఇద్దరు మైనర్లు సహకరించారు. ఈ ఘటనపై అప్పుడు కొమరోలు పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. అప్పటి సీఐ ఫిరోజ్ దర్యాప్తు చేశారు. అనంతరం వచ్చిన సీఐ వి.శ్రీరాం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ సమయంలో పోలీసులు కోర్టులో సరైన సమయంలో సాక్షులను హాజరుపరిచారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కళావతి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. దీంతో ఇద్దరు మైనర్లపై నేరం రుజువైంది. ఒంగోలులోని జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్ పి.భానసాయి మైనర్ ముద్దాయిలకు 3 సంవత్సరాల కాలవ్యవధిలో ఏదైనా ఒక ఏడాది ఒక ప్రభుత్వ వైద్యశాలలో కమ్యూనిటీ సేవలు అందించాలని తీర్పు వెలువరించారు.

లఘుచిత్రాన్ని ఆవిష్కరించిన ఎంపీ మాగుంట


లఘుచిత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు: నా ప్రాణం అనే లఘుచిత్రాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ లఘుచిత్రాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ లఘుచిత్రానికి ట్యాగ్ లైన్‌గా కుటుంబ పరిస్థితి అనే క్యాప్షన్ ఉంచడం ప్రతి ఒక్క వాహనదారుడ్ని, పాదచారుడ్ని ఆలోచింపజేసేలా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో పాటు వాహనదారులు, పాదచారులు కూడా సహకరిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కిరణ్‌చంద్, చక్రవర్తి, కొర్రపాటి శ్రీనివాసరావు (చంటి) తదితరులు పాల్గొన్నారు.

సరైన విత్తనాలు, నారు ఎంపిక ప్రధానం


సూచనలిస్తున్న ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ శారద

ఒంగోలు సబర్బన్: సరైన విత్తనాలు, నారు ఎంపిక చేసుకోవడమే ప్రధాన అంశమని ఒంగోలు ప్రాంతీయ ఉద్యాన శిక్షణ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ శారద రైతులకు సూచించారు. స్థానిక పాత రిమ్స్‌లోని ప్రాంతీయ ఉద్యానవన శిక్షణ సంస్థలో శుక్రవారం కూరగాయలు, మిరప పంటలపై రైతు ఉత్పత్తి సంఘాల రైతులకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఐఐఏటీపీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతు ఉత్పత్తి సంఘాల రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ శారద రైతులకు పంటల సాగులో కొన్ని మెళకువలు నేర్పించారు. ఎంపిక చేసుకున్న విత్తనాలను ఇమిడో క్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేస్తే చాలా వరకు రసం పీల్చే పురుగులను తట్టుకుంటాయన్నారు. మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రసం పీల్చే పురుగు నివారణకు నీలం, పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 25 చొప్పున పెట్టుకోవాలన్నారు. వేప సంబంధిత పురుగు మందులు వాడాలని, రసాయన పురుగు మందులు తగ్గించాలని రైతులకు వివరించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆవశ్యకత, రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతి ఉద్యానవన రైతు డ్రిప్ పద్ధతి ద్వారా నీరు, నీటిలో కరిగే రసాయనిక ఎరువులు వాడాలని సూచించారు. ఒంగోలు ప్రాంతీయ ఉద్యాన శిక్షణ సంస్థ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వేమా యల్లయ్య సేవలు మరువలేనివి

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి


యల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య చేసిన సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కొనియాడారు. శుక్రవారం వేమా యల్లయ్య జయంతి సందర్భంగా చీమకుర్తి రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన మెమోరియల్ హాలులో గల వేమా యల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాగుంట, బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వేమా యల్లయ్య 1987 నుంచి 1983 వరకు సంతనూతలపాడు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా పనిచేసి చీమకుర్తిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశారని గుర్తు చేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. వేమా యల్లయ్య కుమారుడు, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చల్లా అంకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి ప్రదక్షిణ


స్వామివారి ఊరేగింపులో పాల్గొని పూజలు చేస్తున్న బాలినేని శచీదేవి


శచీదేవితో పాటు గిరి ప్రదక్షిణలో భారీగా పాల్గొన్న భక్తులు

● పాల్గొన్న బాలినేని శచీదేవి

ఒంగోలు మెట్రో: పౌర్ణమి కావడంతో శుక్రవారం ఒంగోలు కొండమీద గల వెంకటేశ్వరస్వామి సన్నిధికి గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. గోవింద నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. ప్రదోషకాలంలో వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని గిరి ప్రదక్షిణ చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి పాల్గొని కలియుగ వైకుంఠనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గో సంఘం గోవులకు ప్రదక్షిణ నమస్కారం చేసి కృష్ణ భగవానుడి దర్శనం చేసుకుని స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీగిరి శ్రీనివాసుని భక్త బృందం ఆధ్వర్యంలో రథయాత్రను ఆమె ప్రారంభించారు. అత్యంత భక్తిభావంతో స్వామివారిని స్మరిస్తూ గోవింద నామాలతో నిర్వహించిన గిరి ప్రదక్షిణలో శచీదేవితో పాటు వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ భక్తులు గోవింద నామాలు పలుకుతుండగా సాయంత్రం ఆరు గంటలకు మొదలైన గిరి ప్రదక్షిణ జయరాం హాలు, గ్రంథాలయం, కేశవస్వామిపేట దేవాలయం, శర్మ కాలేజీ రోడ్డు, గద్దలగుంట మీదుగా గో సంఘం శ్రీగిరి వెంకటేశ్వరస్వామి సన్నిధికి చేరుకుంది.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

● స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి

● మేయర్ గంగాడ సుజాత పిలుపు


చెరువుకొమ్ముపాలెంలో మొక్కలు నాటుతున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. శుక్రవారం స్థానిక చెరువుకొమ్ముపాలెంతో పాటు నగరంలో నిర్వహించిన స్వచ్ఛ హీ సేవా, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెరువుకొమ్ముపాలెం వార్డు సచివాలయంతో పాటు ప్రధాన సెంటర్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం చెరువుకొమ్ముపాలెంలో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ హీ సేవా కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్ చేతబట్టి చెరువుకొమ్ముపాలెంలో ర్యాలీ నిర్వహించారు. నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం మంగమూరు డొంక యూపీహెచ్‌సీ పరిధిలోని గాంధీనగర్, వంటవానికాలనీ, శివప్రసాదుకాలనీ, నిర్మల్‌నగర్, లాయర్‌పేట, లంబాడిడొంక, రాజాపానగల్ రోడ్డు-1, రాజీవ్‌నగర్, కొణిజేడు బస్టాండ్ సెంటర్, రంగారాయుడు చెరువు సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. రాజీవ్‌నగర్ వార్డు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కేవలం 28 శాతం మాత్రమే పూర్తి చేశారని, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కలిసి 100 శాతం సర్వే పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికి తిరిగి పోస్ట్ సర్వే చేపట్టాలని అడ్మిన్‌ను ఆదేశించారు. అక్టోబర్ 13వ తేదీ ముంగమూరు రోడ్డు యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులోపు 100 శాతం సర్వే పూర్తి చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని కమిషనర్ ఆదేశించారు.

మండలాన్ని అభివృద్ధి చేద్దాం

● సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుదామని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులంతా మండలాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. సర్వసభ్య సమావేశంలో పలు శాఖల గురించి సమీక్షించారు. ఘడియపూడి సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ తమ గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలను రెండు నెలల క్రితం నాలుగు రోజులపాటు మూసివేశారని, అంగన్‌వాడీ వర్కర్‌కు, ఆయాకు ఒకేసారి సెలవు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పొంతన లేని సమాధానం ఇవ్వడంపై ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌కు సరైన సమాధానం చెప్పాలన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి గ్రామాల వారీగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు చేయించాలని కోరారు. సమీక్షలో పశుసంవర్ధకశాఖ అధికారిణి మాధవి మాట్లాడుతూ సెక్స్ సార్టెడ్ సెమన్ ద్వారా కేవలం ఆడదూడలు పుట్టడానికి ప్రస్తుతం అవకాశం ఉందని, ఆసక్తి ఉన్నవారు రూ.500 ఇచ్చి సెమన్‌ను ఎదకు వచ్చిన గేదెలకు ఇప్పించాలని అన్నారు. ఒకవేళ మగదూడ పుడితే డబ్బు వెనక్కు ఇస్తామన్నారు. పలు శాఖల అధికారులు వారి శాఖల ద్వారా జరుగుతున్న ప్రగతిని సభ్యులకు వివరించారు.

జెడ్పీటీసీకి నివాళులర్పించిన సభ్యులు...

సర్వసభ్య సమావేశానికి ముందుగా ఇటీవల మృతిచెందిన జెడ్పీటీసీ సభ్యురాలు తేళ్ల భాగ్యలక్ష్మికి ఘనంగా నివాళులర్పించారు ఆమె ఆత్మ శాంతించాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. సమావేశంలో నాయకులు గట్టినేని అయ్యన్న, గుడ్డపాతల రవి, విల్సన్, రాయపాటి రమేష్ మజీద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


పోటీల ఎంపికను పరిశీలిస్తున్న జీవీ భాస్కర్

ఒంగోలు: స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్లో శుక్రవారం జరిగిన నెట్‌బాల్ క్రీడాజట్ల ఎంపిక ఉత్సాహంగా సాగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపిక ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శ్రుతి, కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ యం.మహేష్, శశిలక్ష్మి, పీడీ రాజు, పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.కృష్ణ తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. హాజరైన క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించారు. ఎంపికైన జట్లు త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శ్రుతి మాట్లాడుతూ బాలబాలికలకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను వెలికితీసి వారిని మట్టిలో మాణిక్యాలుగా రూపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తి బాగుందని ప్రశంసించి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తాచాటాలని సూచించారు.

క్లుప్తంగా

అవగాహనతో ఉన్నత స్థాయికి చేరాలి

ఒంగోలు సెంట్రల్: అవగాహనతో ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యార్థులు కృషి చేయాలని ఇండియన్ ఇన్నోవేటివ్ శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్ పిలుపునిచ్చారు. స్థానిక పేస్ కళాశాలలో ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్ మాట్లాడుతూ సమాజం అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో ఇన్నోవేషన్స్‌కు శ్రీకారం చుట్టాలని సూచించారు. అటువంటి వారిని ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రోత్సహిస్తుందన్నారు. మంచి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడానికి చేయాల్సిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ ఆర్.వీ రాంజనేయులు, కో ఆర్డినేటర్ డాక్టర్ టి.ఎలియా పాల్గొన్నారు.

జాషువా ఆశయాలు కొనసాగించాలి


జాషువాకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, ఎంపీడీవో సుజాత, తదితరులు

కొత్తపట్నం: గుర్రం జాషువా ఆశయాలు కొనసాగించాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జాషువా జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో సుజాత, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా పొక్లెయిన్ ఏర్పాటు చేసిన మాగుంట


పొక్లెయిన్‌తో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆళ్ల రవీంద్రరెడ్డి, నాయకులు

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల గ్రామంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఉచితంగా ఏర్పాటు చేసిన పొక్లెయిన్‌తో శుక్రవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. డొంకలు, పాడుబడిన రోడ్లు, చిల్లచెట్లు, చిన్నపాటి కాలువలను బాగుచేసుకునే పనులు ప్రారంభించారు. జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి పనులను ప్రారంభించారు. ఇప్పటికే కొత్తపట్నంలో మూడు నెలల నుంచి మూడు పొక్లెయిన్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అల్లూరు, గాదెపాలెం, పాదర్తి, కొత్తపట్నం, రంగాయపాలెం, ఆలూరు గ్రామాల్లో 32 పనులు పూర్తి చేశారు. ఉచితంగా పొక్లెయిన్‌లు ఏర్పాటు చేసిన మాగుంటకు నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాకాని వెంకటేశ్వర్లు, జి.సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ తుమ్మ పుల్లయ్య, సామంతుల చంద్రశేఖరరెడ్డి, మాకాని రాంబాబు, మేడికొండ అర్జునరావు, మల్లవరపు రమేష్, బలగాని నారాయణ, మాకాని వెంకయ్య, కత్తి మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ ఆకస్మిక తనిఖీ

ఒంగోలు రూరల్: స్థానిక త్రోవగుంట, కరవది జెడ్పీ హైస్కూళ్లను ఒంగోలు డిప్యూటీ డీఈఓ రూత్‌మేరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరుగురు హెడ్‌మాస్టర్లతో కూడిన బృందంతో కలిసి అకడమిక్, పాలనాపరమైన విషయాలను పరిశీలించారు. కరవదిలో పాఠశాల వాతావరణం, రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లిష్, ఫిజిక్స్ ఉపాధ్యాయులు జూన్ నుంచి లేరని గ్రామస్తులు ఆమెకు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. తొలుత త్రోవగుంట జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుల బోధన, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రెండో దశ నాడు-నేడు పనులను పరిశీలించారు. త్రోవగుంట హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య, కరవది హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు.

ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలి

ఒంగోలు టౌన్: సాగు ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గుత్తికొండవారిపాలెం, చేజర్ల, ఉలిచి గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు ఏ శైలజారాణి, వీవీ శేషమ్మ, మండల వ్యవసాయాధికారి కిశోర్‌బాబు, ఏఈఓ రామకృష్ణారెడ్డి, వెలుగు సీసీ జె.సుధాకర్, వీఏఏ కృష్ణవేణి, రవిచంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.